



శ్రీకృష్ణుడి చుట్టూ గోపికల వేషధారణల్లో సాంస్కృతిక ప్రదర్శన

ఉత్సాహభరితంగా 'క్రియ'

- జేఎన్‌టీయూకేలో 11వ రాష్ట్రస్థాయి క్రియ పండుగ
- ఆహ్లాదకర వాతావరణంలో చిన్నారులకు పోటీలు
- వివిధ రకాల విచిత్ర వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు
- తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన 8,500 మంది..


6


పరశురాముడి వేషధారణలో..


శక్తి వేషధారణలో అమ్మవారిగా రాక్షసి వధ చేస్తున్నట్టుగా చిన్నారుల ప్రదర్శన


ఎంట్రీ వద్ద పేర్లు నమోదు చేసుకుంటున్న విద్యార్థులు


పుష్ప.. వైల్డ్ ఫైర్ వేషధారణలో..


భేతాళుడి గెటప్‌లో అస్తిపంజరంతో..

రివ్యూ 2024 Review ఆంధ్రజ్యోతి

సాగు..బాగు!



మరో 48 గంటల్లో 2024 చరిత్రలో కలిసిపోతోంది.. మళ్లీ కొత్త ఏడాదిలో కొంగొత్తగా అడుగుపెట్టబోతున్నాం.. మరి 2024 మిగిల్చిన జ్ఞాపకాలేంటి.. విషాదాలేంటి అని ఒకసారి చూస్తే.. వైసీపీ ఉన్నంత వరకూ ఒక లెక్క.. కూటమి వచ్చిన తరువాత మరో లెక్క అనేలా ఉంది పరిస్థితి.. తూర్పు వ్యవసాయాధారిత జిల్లా.. ఇక్కడ ఆనందమైనా.. బాధయినా పంటతోనే ముడిపడి ఉంటుంది.. ఎందుకంటే జిల్లాలో వరి సాగు విస్తీర్ణమే అధికం.. ఆ సాగు బాగుగా ఉంటే ఆనందమే.. అయితే ఆరంభంలో మాత్రం వైసీపీ రైతులకు చుక్కలు చూపించింది. జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టంతో బకాయిలు చెల్లించి అన్నదాతను ఆదుకుంది.. ఖరీఫ్ సీజన్‌లో అయితే 48 గంటల్లోనే ధాన్యం సొమ్ములు చెల్లించి శెహభాష్ అనిపించుకుంది.. కోనసీమ అంటే గుర్తొచ్చేది కొబ్బరి పంట.. ఈ ఏడాది కొబ్బరి కాయ రూ.18లు పలికి రికార్డు సృష్టించింది.. ఇక ఖోఖో అయితే వెయ్యి దాటేసింది.. పొగాకు బంగారంగా మారిపోయింది.. నిమ్మకాయ సీజన్‌తో సంబంధం లేకుండా ధర నిలకడగా ఉండిపోయింది. మొత్తంగా చూస్తే ఈ ఏడాది రైతులకు కలిసొచ్చింది..

- (అమలాపురం/రాజమహేంద్రవరం, ఆంధ్రజ్యోతి)

- అన్నదాతకు కలిసొచ్చిన కాలం
- కూటమి రాకతో తీరిన వర్రీ
- ఉద్యాన పంటల ధరల రికార్డు
- అడపాదడపా తుఫాన్‌లు
- ముంచెత్తిన ఏలేరు

ఈ ఏడాది వ్యవసాయం ఉగాది పచ్చడిలా ఉంది..అంతగా నష్టాలు లేవు.. అలాగని లాభాలు లేవు.. కాస్త తీపి.. కాస్త చేదు.. కాస్త కారం.. ఇలా షడ్రుచులు కనిపించాయి.సాగు బాగుందా అంటే బాగుంది అంతే. గతేడాదికంటే కాస్త బెటర్ అని ఖచ్చి తంగా చెప్పవచ్చు.ఎందుకంటే ఈ ఏడాది వరి వర్రీ తీరి పోయింది.ప్రభుత్వం మారిందో లేదో.. అలా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన 48 గంటల్లోనే సొమ్ములు జమయ్యాయి..రబీ సీజన్ డబ్బులైతే ఇంకా పడ్డా యో లేవో కూడా తెలియదు.ఎందుకంటే ఆ సీజన్ జగన్ ప్రభుత్వంలో అన్నదాతలు పంట డబ్బులకు అష్టకష్టాలు పడ్డారు.ఇక నిమ్మ,కొబ్బరి, పొగాకు, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలైతే దిగుబడి తగ్గడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో రైతు కాస్త ఊపిరి పీల్చుకున్నాడు.

2.42 లక్షల హెక్టార్లలో సాగు..


ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలు రైతులను వెంటాడినా రైతులు గట్టెక్కారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాగువిస్తీర్ణం 2.42 లక్షల హెక్టార్లు ఉంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో గత వైసీపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రభుత్వం విధించిన సవాలక్ష నిబంధనల మధ్య ధాన్యం విక్రయాలు చేపట్టినా రైతులకు ధాన్యం బకాయిలను సకాలంలో చెల్లించలేదు. దీంతో రైతులు ఉద్యమ బాట పట్టారు.మేలో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించడంతో వైసీపీ ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన బకాయిలను సైతం ముఖ్యమంత్రి చంద్రబాబు సకాలంలో చెల్లించి ఆదుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆ తరువాత చంద్రబాబు ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ధాన్యాన్ని సివిల్ సప్లయిస్‌కు విక్రయించిన రైతులకు 48 గంటల్లోనే బ్యాంకు ఖాతాలకు నేరుగా డబ్బులు జమ కావడంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేవు. ధాన్యానికి క్వింటాకు రూ.117 మద్దతు ధర కేంద్రం పెంచింది.

కొబ్బరి ధర రికార్డు


ఇతర రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు అంతంతమాత్రంగానే ఉండడంతో కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.ఈ ఏడాది ప్రారంభంలో వెయ్యి కొబ్బరి కా యల ధర రూ.8 వేలు ఉంది. మార్చి నెలలో కోనసీమ ప్రాంతం అంబాజీపేటలో నాఫెడ్ కేంద్రాన్ని ప్రారంభించడంతో కొబ్బరి మార్కెట్ పుంజుకుంది. అప్పటి నుంచి పచ్చికొబ్బరికాయ రూ.10 నుంచి రూ.18 వరకూ గరిష్ఠంగా పెరిగింది. కార్తీకమాసం తరువాత కొబ్బరి కాయ రూ.12లకు పడిపోయింది. గత రెండు రోజుల నుంచి పచ్చికొబ్బరికాయల ధర రూ.15ల వద్ద కొనసాగుతుంది.2025 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించింది.

ముంచెత్తిన..ఏలేరు

ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతను వదల్లేదు. వరదలు, భారీ వర్షాలు, తుఫాన్ల వంటి విపత్తుల వల్ల పంటలను నష్టపోయారు. వరితో పాటు వివిధ రకాల ఉద్యాన, మెట్ట పంటలకు నష్టం వాటిల్లింది. సెప్టెంబరులో సంభవించిన ఏలేరు అకాల వరద వల్ల కాకినాడ జిల్లాలో 14 మండలాల్లో 14,425 హెక్టార్లలో రూ.36 కోట్లు విలువైన పంటలకు నష్టం వాటిల్లింది. సుమారు 26 వేల మంది రైతులకు నష్టం సంభవించింది. అక్టోబరులో అకాల వర్షాలతో కాకినాడ జిల్లాలో 110 హెక్టార్లు, డిసెంబరులో వచ్చిన ఫెంగల్ తుఫాన్ వల్ల 65 హెకార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. కోనసీమ జిల్లాలో 538 హెక్టార్లలో వరి పంట ముంపు బారిన పడింది. 1926 హెక్టార్లలో ఉద్యానపంటలకు నష్టం కలిగింది. ఆగస్టులో సంభవించిన గోదావరి వరదల వల్ల కోనసీమ జిల్లాకు నష్టం కలిగింది.తూర్పుగోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది.


పెద్దాపురంలో ఏలేరు కాలువ ఉధృతి పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

నిమ్మ పంట పండింది!



దేవరపల్లి/రాజానగరం : నిమ్మకాయలు ధరలు ఈ ఏడాది ఆరం భం నుంచి తగ్గే దేలే అన్నట్టు రైతులకు కాసులు కురిపిం చాయి. జనవరి నుంచి ఫిబ్రవరి వరకు కిలో ధర రూ.24 నుంచి రూ.45లకు ఎగబాకింది.మార్చి, ఏప్రిల్,మేలో కిలో రూ.55 - రూ.60 వరకు పెరు గు తూ వచ్చింది. జూన్, జూలై కిలో రూ.20 - రూ.35 వరకు కొంత వరకు తగ్గింది. ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు రూ.30 - రూ.45 వరకు ధర నిలకడగా ఉంది. వర్షాకాలంలో అధిక వర్షపాతం వల్ల దిగుబడి తగ్గింది.ఈ ఏడాది సీజన్ అన్ సీజన్ అనే తేడా లేకుండా అన్ని రోజుల్లోనూ ధర పలికింది.



కోకో.. పరుగే..పరుగు

పెరవలి : ఈ ఏడాది కోకో గింజల ధర కేక పెట్టింది.గతంలో ఎన్నడూ లేని విధంగా క్రమ క్రమంగా రేటు పెరుగుతూ ఒక వెయ్యి 50 రూపాయలు గింజల రేటు పెరగడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. గతేడాది కేజీ గింజల ధర రూ.240 మాత్రమే పలికింది. సుమారు పదేళ్ల కిందట కేజీ గింజల ధర వంద రూపాయల్లోపు మాత్రమే ఉండేది. ఆ రేటు క్రమ క్రమంగా పెరుగుతూ గతేడాది అధిక ధర రూ.240 పలికింది.ఈ సంవత్సరం రూ.300 నుంచి రూ.800ల వరకూ అత్యధిక ధర రూ.1050 పలకడంలో ఎక్కువ మంది రైతుల ఖోఖోవైపు మొగ్గు చూపుతున్నారు. మిగిలిన పంటలు కొబ్బరి, అరటి, తదితర పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతుల ఎక్కువ మంది ఖోఖో వైపు మొగ్గు చూపుతున్నారు.



పొగాకు..బంగారం

గోపాలపురం : ఈ ఏడాది పొగాకు బంగారమైంది. పొగాకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కిలో పొగాకు రికార్డు ధర పలికింది.గతంలో కిలో పొగాకు ధర రూ.200లు పలికితే చాలనుకునే రైతులు ఈ ఏడాది కిలో రూ.400లు ధర పలకడంతో ఎగిరి గంతేశారు. దీంతో పొగాకు సాగు విస్తీర్ణం రెట్టింపయ్యింది. గ్రేడ్ -1 పొగాకు క్వింటా ధర రూ.40 వేలు పలకడంతో 2024 రైతులకు తీపి జ్ఞాపకంగా మిగిలింది.

జీడిపప్పు అధరహో

నల్లజర్ల : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో జీడిమామిడి సాగు ఎక్కువ విస్తీర్ణంలో ఉంది.జీడిమామిడి దిగుబడి తగ్గి డిమాండ్ ఎక్కువ ఉండడంతో ధరలు పెరిగాయి.రైతుల వద్ద నుంచి జీడిగింజల సేకరణ పూర్తయ్యాక జీడిపప్పు రేటు పెరగడం కొసమెరుపు.జీడిపప్పు ధర మార్చి నెలలో కిలో రూ.550 ఉండగా అక్టోబరు నెలలో ఏకంగా కిలో రూ.800 చేరింది. నవంబరు నెలలో కిలో రూ20 తగ్గి ప్రస్తుతం కిలో రూ.780 వద్ద స్థిరపడింది. జిల్లాలో సాగు విస్తీర్ణం ఉన్నా ధరలు మాత్రం ఆకాశం వైపే చూస్తున్నాయి.

జీవో నంబరు 7 ప్రకారమే

ఆక్వా చెరువుల అనుమతులు మంజూరు చేయాలి

కలెక్టర్ మహేష్‌కుమార్


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన జీవో నంబరు 7 ప్రకారమే ఆక్వా చెరువుల అనుమతులను మంజూరు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. తీర ప్రాంతం వెంబడి ఆక్వా జోన్, ఆక్వాయేతర జోన్లలో ఎంతమేర విస్తీర్ణంలో ఆక్వా చెరువులు ఉన్నవి సర్వే ఆధారంగా ఖచ్చితత్వంతో గుర్తించి నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జియో కోఆర్డినేట్స్ మ్యాప్‌లతో సహా బృందాలు సర్వే నిర్వహించాలన్నారు. కలెక్టరేట్‌లో శనివారం కాలుష్య నియంత్రణ మండలి, భూగర్భ, జలవనరులు, మత్స్య శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్య, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులతో సర్వే బృందాలను నియమించి ఎంతమేర ఏయే జోన్లలో ఆక్వాసాగు జరుగుతుందో క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించాలన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న చెరువులకు అనుమతులు ఉన్నదీ లేనిదీ, మార్గదర్శకాలను పాటిస్తున్నారో లేదో నివేదికలో పొందుపరచాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 46 వేల ఎకరాల్లో ఆక్వాసాగు ఉండగా ఆక్వాజోన్‌లో లేని 7వేల ఎకరాలకు గ్రామ, మండల, డివిజన్ల వారీగా ఆక్వా జోనేషన్ ట్రైపును నిర్ధారించాలన్నారు. పంటకాల్వలు, నదీ పరివాహక జిల్లాలను మాత్రమే ఆక్వాసాగుకు వినియోగించాల్సి ఉందని, ఉప్పునీటిని భూగర్భ జలాలను వినియోగిస్తుంటే పరిశీలన చేసి నివేదికలో పొందుపరచాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి సూత్రాల ప్రకారం పెద్దపెద్ద ఆక్వా చెరువులకు చుట్టూ సీఫేజ్ డ్రెయిన్ల ద్వారా ఊట నీరు పారే సౌకర్యంపై ఆరా తీయాలన్నారు. సబ్ డివిజన్ స్థాయి కమిటీ పరిధిలో సంబంధిత ఆర్డీవో ఐదు హెక్టార్లలోపు చెరువులకు అనుమతులు మంజూరు చేస్తూ పైబడిన విస్తీర్ణంలో ఆక్వా చెరువుల అనుమతులు కోరితే కోస్టల్ ఆక్వా అథారిటీ విభాగానికి పంపించాలన్నారు. కోస్టల్ రీజియన్ జోన్ నిబంధనలు పాటిస్తున్నవీ లేనివీ పర్యవేక్షించాలన్నారు. హరిత ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా ఆక్వాసాగులో ఉన్న చెరువుల రద్దుకు సంబంధించి వైనతేయ నదిని అనుకుని గొల్లపాలెం, కరవాక, గోగన్నమఠం గ్రామాల్లో కొనసాగుతున్న రద్దు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఇన్‌చార్జి డీఆర్వో కె.మాధవి, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ శంకరరావు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, భూగర్భ జలశాఖ సహాయ సంచాలకుడు శివప్రసాద్, మత్స్య అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

ఎస్.యానాంలో బీచ్ వాలీబాల్ పోటీలు ప్రారంభం -6లో

అమలాపురంలో రైతుబజార్ పునఃప్రారంభానికి చర్యలు

అమలాపురం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఉన్న రైతు బజార్‌ను పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి వెల్లడించారు. రైతు బజార్ ప్రాంగణంలో శనివారం రైతులతో అవగాహన సదస్సును నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన రైతులతో పాటు ఉద్యాన, మార్కెటింగ్, మత్స్యశాఖల అధికారులు సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గత కొంతకాలంగా ఆర్టీసీ బస్టాండు ఎదురుగా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఉన్న రైతు బజార్ వివిధ కారణాలతో పూర్తిస్తాయిలో నిర్వహణ జరగడం లేదని గుర్తించి పునరుద్ధరణకు చర్యలు చేపట్టామన్నారు. ఈ నెల 18న రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, సహకార, మత్స్యశాఖల మంత్రి కె.అచ్చెన్నాయుడు జిల్లా సమీక్షలో రైతు బజార్ల అంశాన్ని ప్రస్తావించారన్నారు. జిల్లాకు సంబంధించి అమలాపురం, రాయవరం రైతుబజార్ల సమస్యలపై చర్చించిన అనంతరం పునఃప్రారంభానికి చర్యలు చేపట్టినట్టు జేసీ వెల్లడించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుబజార్ నిర్వహణకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యానశాఖ అధికారులు గ్రామాల్లోని కూరగాయలు పండించే రైతులను గుర్తించి దరఖాస్తులు అందజేయడంతో పాటు పండించిన పంటను నేరుగా రైతులు రైతు బజార్లకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకుండానే విక్రయాలు జరుపుకునే విధంగా చైతన్య పరచాలని ఆదేశించారు. దళారీ వ్యవస్థను పూర్తిగా లేకుండాచేసి రైతుబజార్ నిర్వహణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు తాజాగా లభ్యమయ్యేలా చూడడంతో పాటు చికెన్, మటన్, చేపల దుకాణాలను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో సంఘటితంగా మూడు కిరాణా దుకాణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలుదారుల సౌలభ్యం కోసం క్యాంటీను ఏర్పాటు చేయాలన్నారు. రోజువారీ వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తూ పారిశుధ్య చర్యలను పురపాలక సంఘం చేపట్టాలన్నారు. ఆర్టీసీ సంస్థ రైతులు పండించిన పంటలను నేరుగా రైతు బజార్‌కు తీసుకువచ్చేలా ఉదయం నుంచి బస్సులు నడపాలని, కనీస చార్జీలు వసూలు చేయాలని జేసీ సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో కె.మాధవి, జిల్లా ఉద్యానశాఖ అధికారి బీవీ రమణ, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, మార్కెటింగ్‌శాఖ అధికారి కె.విశాలాక్షి, ఉద్యానశాఖ సిబ్బంది, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి సైనికుల కోసం..

సైనిక్ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆంధ్రజ్యోతి/తుని రూరల్:



పరీక్ష కేంద్రాలు

దేశ వ్యాప్తంగా 190 కేంద్రాల్లో ఆయా రాష్ట్రాల వారీగా పరీక్ష రాసే అవకాశం కల్పించారు.
ఆంధ్రప్రదేశ్: విశాఖపట్నం, విజయనగరం, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం..

మీ పిల్లలు.. రేపటి దేశ రక్షకులు కావాలనుకుంటున్నారా..? అయితే దేశభక్తిని చాటుకునేందుకు మీకు ఇది చక్కటి అవకాశం. సైన్యంలో చేరికకు పటిష్ట పునాది లాంటిది కూడా.. దేశవ్యాప్తంగా సైనిక్ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నారు. దీనికి గాను ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశం పొందేందుకు అవకాశం కల్పిస్తున్నారు. దీనికి వచ్చేనెల 13వతేదీ దరఖాస్తుకు తుది గడువుగా ఉంది. ఇంకెందుకు ఆలస్యం.. ఇందులో చేరికకు అర్హతలు.. అవకాశాల గురించి తెలుసుకుందాం..

- దేశభక్తిని చాటుకునేందుకు చక్కటి అవకాశం
- సైన్యంలో చేరికకు పటిష్ట పునాది
- ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశం పొందేందుకు అవకాశం
- వచ్చేనెల 13వతేదీ దరఖాస్తుకు తుది గడువు
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అర్హత పరీక్ష

దేశభక్తిని చాటుకోవాలనే విద్యార్థులకు సైనిక్ పాఠశాలలు చక్కటి అవకాశం కల్పిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 2025-26 ఏడాదిలో ఆరు, తొమ్మిదో తరగతుల్లో సైనిక్ పాఠశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. దేశరక్షణలో భాగంగా త్రివిధ దళాలకు అవసరమైన సైనిక అధికారులను తయారు చేయాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా సైనిక్ పాఠశాలలను ప్రారంభించారు. వీటికి సంబంధించిన ప్రవేశ పరీక్షలను ప్రస్తుతం ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నిర్వహిస్తోంది. సైనిక్ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి బాలబాలికలు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశం పొందడానికి బాలురు మాత్రమే అర్హులు. ఇందులో సీటు పొందడానికి ఎన్‌టీఏ నిర్వహించే ప్రవేశ పరీక్ష, వైద్యపరీక్షల్లో అర్హత సాధించాలి. ఇక్కడ ఇంటర్మీడియట్ వరకు విద్యను కొనసాగించొచ్చు.

రిజర్వేషన్లు

ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7.5శాతం, రక్షణ శాఖలో పనిచేస్తున్న వారు, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు 25శాతం సీట్లు కేటాయిస్తారు. ఆరో తరగతిలో 80 సీట్లు, తొమ్మిదో తరగతిలో 20 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేస్తారు. జనన, కుల, నివాస, ధ్రువపత్రాలతోపాటు సైనిక ఉద్యోగుల పిల్లలకు సర్వీసు ధ్రువపత్రం, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు పీపీఓను అప్‌లోడ్ చేయాలి.

అర్హతలు

సైనిక్ పాఠశాలలో ప్రవేశానికి ఆరో తరగతిలో చేరాలనుకునే విద్యార్థులు 10 నుంచి 12ఏళ్ల(2013, ఏప్రిల్ 1 నుంచి 2015, మార్చి 31) మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదువుతుండాలి. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి 13నుంచి 15ఏళ్ల వయస్సు కలిగి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదువుతూ(2010, ఏప్రిల్ 1 నుంచి 2012, మార్చి 31) లోపు జన్మించి ఉండాలి.

పరీక్షా విధానం

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా నిర్వహించే ప్రవేశ పరీక్ష పూర్తిగా రాత విధానం(ఓఎంఆర్ సీట్స్)లో ఉంటుంది. ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు రెండున్నర గంటలు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు 3గంటల పరీక్ష సమయం. ఆరో తరగతి పరీక్ష గుర్తింపు పొందిన అన్ని ప్రాంతీయ భాషల్లో, తొమ్మిదో తరగతికి ఆంగ్లంలో ఉంటుంది.

సౌకర్యాలు..

సైనిక్ పాఠశాలలో ఎంపికైన విద్యార్థులకు ఆరునుంచి ఇంటర్ వరకు విద్య, వసతితోపాటు, ఎన్‌సీసీ, యోగా, చిత్రలేఖనం, సంగీతం, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఈత, గుర్రపు స్వారీ తదితర సహ పాఠ్య కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తారు. మొదటి ఏడాది రూ.1.10 లక్షల ఫీజుగా చెల్లించాలి. విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 50శాతం విద్యార్థులకు రక్షణశాఖ నుంచి రూ.53వేల చొప్పున ఉపకార వేతనం అందుతుంది. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పొందొచ్చు. సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత నేషనల్ డిఫెన్స్ అకాడమీ పరీక్ష(ఎన్‌డీఏ) నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే పుణేలో రెండేళ్ల శిక్షణ ఇస్తారు. ప్రతిభ ఆధారంగా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో అధికారులుగా నియమిస్తారు.



సిలబస్ ఆరో తరగతి

300 మార్కులకు పరీక్ష ఉంటుంది. గణితం 150 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ 50 మార్కులకు, భాషా సామర్థ్యం 50 మార్కులకు, జనరల్ ఇంటెలిజెన్స్ 50 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 150 నిమిషాలు(2.30 గంటలు) అభ్యర్థులు ప్రతి విభాగంలో కనీసం 25శాతం మార్కులు తప్పనిసరిగా సాధించాలి. అన్ని సబ్జెక్టులు కలిపి 40 శాతం మార్కులు రావాలి.



మనకి కోరుకొండ సైనిక్ స్కూల్

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో మొత్తం 33 సైనిక్ పాఠశాలలు ఉండగా ఏపీ, తెలంగాణలకు కలిపి మన రాష్ట్రంలోని విజయనగరం జిల్లాలో కోరుకొండ సైనిక్ స్కూల్ ఉంది. దాని వెబ్‌సైట్ www.sainikschoolkorukonda.org లో అక్కడి శిక్షణకు సంబంధించి పూర్తి వివరాలు లభ్యమవుతాయి.

దరఖాస్తు చేయండిలా..

www.aissee.nta.nic.in వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవాలి. ధ్రువపత్రాలను, విద్యార్థి ఫొటో, సంతకం అప్‌లోడ్ చేయాలి. జనరల్, ఓబీసీ, డిఫెన్స్ కేటగిరీ అభ్యర్థులు రూ.800, ఎస్సీ, ఎస్టీలు రూ.650 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. దరఖాస్తులు ఈనెల 24నుంచి స్వీకరిస్తుండగా వచ్చేనెల 13వ తేదీ సాయంత్రం 5గంటల వరకు చేసుకునే అవకాశం కల్పించారు. జనవరి 14వ తేదీ రాత్రి 11.50 గంటల వరకు ఫీజు కట్టేందుకు గడువు ఇచ్చారు. నమోదు చేసుకున్న ఫోన్ నెంబరుకు సంక్షిప్త సందేశాన్ని పంపిస్తారు. ఆన్‌లైన్‌లో పంపిన విద్యార్థుల దరఖాస్తును ప్రింట్ తీసుకుని భద్రపరచుకోవాలి. పరీక్ష ఎప్పుడు నిర్వహించేది ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) త్వరలో ప్రకటిస్తుంది.

సిలబస్ తొమ్మిదో తరగతి

400 మార్కులకు పరీక్ష ఉంటుంది. దీనిలో గణితం 200 మార్కులకు, సామాన్యశాస్త్రం 50 మార్కులు, ఆంగ్లంలో 50 మార్కులకు, సాంఘికశాస్త్రం 50, ఇంటెలిజెన్స్ 50 మార్కులకు సంబంధించి ఉంటుంది. పరీక్ష సమయం 180 నిమిషాలు(3గంటలు). అభ్యర్థులు ప్రతి విభాగంలో కనీసం 25శాతం మార్కులు సాధించాలి. అన్ని సబ్జెక్టులు కలిపి 40 శాతం మార్కులు రావాలి. రాత పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు 1:3 నిష్పత్తిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.


ఘటోత్కచుడి వేషధారణలో..


శక్తి వేషధారణలో రాక్షస సంహారం చేస్తున్న అమ్మవారిగా..


సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో విద్యార్థులు


భరతమాత.. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో..


వేంకటేశ్వరస్వామి వేషంలో..

ఉత్సాహభరితంగా 'క్రియ'


విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న జేపీ తదితరులు

- జేఎన్‌టీయూకేలో 11వ రాష్ట్రస్థాయి క్రియ పండుగ
- ఆహ్లాదకర వాతావరణంలో చిన్నారుల పండగ
- వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు
- ఏపీ, తెలంగాణా నుంచి తరలివచ్చిన 8,500 విద్యార్థులు
- ముఖ్యఅతిథిగా హాజరైన జేపీ

సర్పవరంజంక్షన్,డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వారంతా భావి భారతపౌరులు. తరగతిగదిలో గడిపే విద్యార్థులంతా ఉత్సాహంగా.. సాంస్కృతిక, క్విజ్, వ్యాసరచన, వేషాలు, నాటిక, నాటక పోటీల్లో తమ ప్రతిభను కనబర్చారు. చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు క్రియ సంస్థ నిర్వహిస్తున్న 11వ రాష్ట్రస్థాయి క్రియ అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు కాకినాడ జేఎన్‌టీయూలో శనివారం ప్రారంభమయ్యాయి.

తొలిరోజు 15 అంశాల్లో..

ఉదయం 7గంటల నుంచి క్రియపిల్లల పండుగ ప్రారంభమైంది. ఇందులో పాల్గొన్న 5నుంచి 10వ తరగతి విద్యార్థులు ఉత్సాహభరితంగా పలు అంశాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. తొలిరోజునాటికలు, శాస్త్రీయ నృత్యాలు, ఏక పాత్రాభినయం, డిబేట్, మ్యాప్, సైన్స్ ఎగ్జిబిషన్, పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, వ్యాసరచన, స్టోరీ విశ్లేషణ, అంతర్జాలంలో అన్వేషణ, ప్రాజెక్టులు, క్విజ్, విచిత్ర వేషధారణ, పాటలు తదితర 15అంశాల్లో సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక,శాస్త్రీయ నృత్యప్రదర్శనలు అలరించాయి.

ప్రతిభను వెలికితీసేందుకు దోహదం

విద్యార్థుల్లో నిబిడీకృతమై ఉన్న కళలను వెలికితీసేలా క్రియ సంస్థ ఒక మహోద్యమంలా ఏటా చిన్నారుల పండుగ నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ అన్నారు. క్రియ సాంస్కృతిక పోటీలు, క్విజ్ డిబేట్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల శక్తిసామర్థ్యాలను, నైపుణ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. క్రియ సొసైటీ చిత్తశుద్ధితో విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, తద్వారా భవిష్యత్తులో నచ్చిన రంగంలో రాణించేందుకు బంగారు బాటలు వేస్తోందని కితాబిచ్చారు. భావిభారత పౌరుల పిల్లల పండుగకు జేఎన్‌టీయూ వేదిక కావడం ఆనందంగా ఉందని, నేటిపిల్లలే రేపటి శాస్త్రవేత్తలు అని ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు విచ్చేసిన విద్యార్థులకు క్రియా సంస్థ సభ్యులు 100మంది, 150 మంది జేఎన్‌టీయూకేకి చెందిన బీటెక్, ఎంబీఏ విద్యార్థులు వలంటీర్లుగా సేవలు అందించారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలికలకు యుక్తవయసులో వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. సత్యస్కాన్ ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో క్రియ సొసైటీ అధ్యక్ష, సెక్రటరీలు పి.శ్రీనివాస్, ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, ఆర్గనైజర్ జగన్నాథరాజు, యు.మాచిరాజు, డాక్టర్ ప్రవీణ్, జగన్నాథరం పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఏపీ, తెలంగాణాకు చెందిన 350 పాఠశాలలకు చెందిన 8,500మంది అత్యంత ఉత్సాహంగా పాల్గొని వివిధ సాంస్కృతిక, క్విజ్, వ్యాసరచన తదితర పోటీల్లో పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు

మేప్(జూనియర్స్)విభాగంలో విజేత: ఎస్.హేమంత్ రాజ్(సర్పవరం హైస్కూల్, కాకినాడ జిల్లా)
మేప్(సీనియర్స్) విజేత: వి.సూర్యకీర్తి(8వతరగతి)(విద్యాంజలి స్కూల్, కాకినాడ జిల్లా)
గ్రూప్ సాంగ్(జూనియర్స్) విజేత: విజ్ఞాన్ విహార్ హైస్కూల్(మంగళగిరి, ఎన్టీఆర్ జిల్లా)
సీనియర్స్ విజేత: ఎస్‌బీఎంఆర్ ప్రభుత్వ హైస్కూల్(పిఠాపురం, కాకినాడ జిల్లా)
డిబేట్(సీనియర్స్) విజేత: పి.చరణ్, పి.సుభాష్, ఎ.సాయితేజ, విద్యాంజలి స్కూల్(కాకినాడ జిల్లా)
కోలాటం(సీనియర్స్) విజేత: సాలిపేట బాలికల హైస్కూల్(కాకినాడ)
క్లాసికల్ డాన్స్(సీనియర్స్) విజేత: శరణ్య హైస్కూల్(వేమవరం, కాకినాడ జిల్లా)
క్లాసికల్ డాన్స్(సబ్ జూనియర్స్) విజేత: భాష్యం స్కూల్, రామచంద్రపురం(కోనసీమ జిల్లా)
క్లాసికల్ డాన్స్(జూనియర్స్) విజేత: యోగానంద హైస్కూల్(కాకినాడ)
సైన్స్‌ఎక్స్‌పెరిమెంట్స్(సీనియర్స్)విజేత: పట్టా సంజయ్‌వెంకట్, పగడాలపేటహైస్కూల్(కాకినాడ)
సైన్స్‌ఎక్స్‌పెరిమెంట్స్(జూనియర్స్)విజేత: కె.రాజసందీప్‌రాజ్, ఎల్‌పీటీహైస్కూల్, సూర్యారావుపేట(కాకినాడ)


స్వామి వివేకానందుడిగా..


ఝాన్సీలక్ష్మీభాయ్ వేషధారణ


సాంస్కృతిక ప్రదర్శనతో ఆకట్టుకుంటూ..


శక్తి వేషధారణల్లో అమ్మవార్లుగా..


కోయదొర వేషంలో..


అల్లూరి వేషధారణలో చిన్నారి

కాకినాడలో సినీ నటుడు వెంకటేష్ సందడి

- ఓ ప్రైవేట్ చానెల్ ప్రోగ్రాంలో పాల్గొన్న 'సంక్రాంతికి వస్తున్నాం' బృందం


కార్యక్రమంలో నృత్యం చేస్తున్న వెంకటేశ్


దర్శకుడు అనిల్ రావిపూడితో వెంకీ

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో ప్రముఖ సినీనటుడు విక్టరీ వెంకటేష్ శనివారం సందడి చేశారు. 'సంక్రాంతికి వస్తున్నాం..' టీంతో కలిసి ఆయన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. సినీ హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి, దర్శకుడు అనిల్ రావిపూడితోపాటు నటులు రాజేంద్ర ప్రసాద్, నటి గౌతమిలతో కలిసి కాకినాడ పీఆర్ కళాశాల మైదానంలో ఒక ప్రైవేటు టీవీ చానల్ నిర్వహించిన 'సంక్రాంతి' కార్యక్రమంలో పాల్గొన్నారు. స్టేజీపై విక్టరీ వెంకటేశ్ నృత్యం చేసి అందరినీ హుషారెత్తించారు. దీంతో పీఆర్ కళాశాల మైదానం ప్రేక్షకులతో కిక్కిరిసింది. యువత కేరింతలతో ఆ ప్రాంతం సందడిగా మారింది.

ఎస్.యానాంలో టూరిజం ప్రాజెక్టుకు బంగారు భవిష్యత్

- మంత్రి నిమ్మల రామానాయుడు
- జగన్ ప్రభుత్వం రూ.150 కోట్లు దోచేసింది: మంత్రి సుభాష్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఉప్పలగుప్తం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం టూరిజం ప్రాజెక్టుకు బంగారు భవిష్యత్ ఉందని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. అంబేడ్కర్ కోనసీమజిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో నేషనల్ మహిళా బీచ్ వాలీబాల్ పోటీలను క్రీడాజ్యోతిని వెలిగించి శనివారం ఆయన ప్రారంభించారు. వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పలచోళ్ల పద్మనాభం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్.యానాం బీచ్ అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు ఎస్.యానాంలో టూరిజం ప్రాజెక్టు అభివృద్ధికి చేస్తున్న కృషి ప్రభుత్వానికి ఆదాయం, స్థానికులు ఉపాధి కల్పిస్తుందన్నారు.. గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో రూ.150కోట్లు దోచేసిందని కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. కూటమి పాలనలో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ఎస్.యానాంలో టూరిజం ప్రాజెక్టు జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలన్నదే తన లక్ష్యమన్నారు. సంక్రాంతి సంబరాలకు బీచ్‌ను వేదికగా చేయడం ద్వారా పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఎస్.యానాం బీచ్ వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లంకే భీమరాజు, సంయుక్త కార్యదర్శి అయితాబత్తుల అజయ్‌సింగ్, సభ్యుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, వాటర్ డీసీ చైర్మన్ దంగేటి చిట్టిబాబు, అరిగెల నానాజీ, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆర్డీవో కె.మాధవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బీచ్ వాలీబాల్ పోటీలు


హోరాహోరీగా తలపడుతున్న బీచ్ వాలీబాల్ జట్లు

అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్.యానాంలో శనివారం నేషనల్ మహిళా ఇన్విటేషన్ బీచ్‌వాలీబాల్ పోటీలు శనివారంరాత్రి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. వాలీబాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో తొలుత గోవా, పుదుచ్చేరి జట్ల మధ్య పోరు జరిగింది. రాత్రి 9.30 గంటలకు మూడో మ్యాచ్ ఆంధ్రా, పుదుచ్చేరి జట్ల మధ్య పోటీ కొనసాగుతోంది. టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి గొలకోటి ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో కామన మధుతోపాటు పలువురు పీడీలు, పీఈటీలు, నేషనల్ రిఫరీలు పోటీలను నిర్వహించారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

- స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.42.93లక్షలు

ఆత్రేయపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.42.93598 లభించినట్లు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, మాడవీధుల్లో పోటెత్తిన భక్తులు

పండ్ల తోటల సాగుకు నూతన యాజమాన్య పద్ధతులు

అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధనా ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రకాష్ పాటిల్

కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రం పరిశీలన

పరిశోధన ప్రగతిపై శాస్త్రవేత్తలతో సమీక్ష





కొవ్వూరు అరటి పరిశోధనా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రకాష్ పాటిల్, పలు అంశాలను వివరిస్తున్న శాస్త్రవేత్తలు

కొవ్వూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా పండ్ల తోటలు సాగుచేసే రైతులకు ఎప్పటికప్పుడు నూతన యాజమాన్య పద్ధతులు అందజేస్తున్నట్టు అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధనా ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రకాష్ పాటిల్ అన్నారు. శనివారం కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రాన్ని ఆయన పరిశీలించి ఏడాదిగా జరుగుతున్న పరిశోధన ప్రగతిపై శాస్త్రవేత్తలతో సమీక్షించారు. పండ్లలో కొత్త రకాల ఉత్పత్తి, వేరే ప్రాంతాల్లో విడుదల చేసిన వంగడాలు ఈ ప్రాంతంలో సాగుకు అనుకూలతలు, సాగులో నూతన యాజమాన్య పద్ధతులు, అరటిని ఆశించే తెగుళ్లను ఎదుర్కోవడానికి చేస్తున్న పరిశోధనలను అడిగి తెలుసుకున్నారు. పరిశోధనా ఫలితాలు ఎంతవరకు రైతులకు అందుతున్నాయో తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పండ్ల తోటలు సాగుచేసే రైతులు నష్ట పోకుండా పరిశోధనలు జరుపుతున్నామన్నారు. ఈ పరిశోధనలకు కేంద్రం నుంచి 75 శాతం, రాష్ట్రం నుంచి 25శాతం నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, కడప జిల్లా అనంతరాజుపేట, వెంకట్రామన్నగూడెం, కొవ్వూరు 4 కేంద్రాల్లో అరటి, పనస, సపోట, మామిడి, బొప్పాయి, జామ, నిమ్మ జాతికి చెందిన పంటలపై పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. సాగులో రసాయనాలు తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దేశంలో వివిధ ప్రాంతాలకు అనుగుణంగా యాజమాన్య పద్ధతులను కనుగొంటున్నామన్నారు. ప్రతి రెండేళ్లకు యూనివర్శిటీ నుంచి నూతన యాజమాన్య పద్ధతులపై ఉద్యాన పంచాంగం (డైరీ), పుస్తకాలను తయారుచేసి రైతులకు అందజేస్తున్నామన్నారు. పరిశోధనల అనంతరం పరీక్ష చేసి వచ్చిన ఫలితాలపై రైతులు సంతృప్తి చెందితే అధికసంఖ్యలో మేలైన వంగడాలను తయారుచేసి అందజేస్తున్నామన్నారు.

రెండేళ్లలో మేలైన డ్రాగన్ ఫ్రూట్

వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్శిటీ డైరెక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పద్దిపర్రులో రైతు 3 ఎకరాల్లో అవకాడో పంట సాగు చేస్తున్నారన్నారు. డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, రాంభూటన్ పండ్లకు సంబంధించి వెంకట్రామన్నగూడెంలో పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. రైతులు సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటల్లో చీడపీడలతో పాటు, పండ్ల సైజు చిన్నదిగా ఉండడం, నాణ్యత వంటి అంశాలపై మూడేళ్లుగా పరిశోధనలు చేస్తున్నామన్నారు. మరో రెండేళ్లలో మేలైన డ్రాగన్ ఫ్రూట్ వంగడాలను రైతులకు అందజేస్తామన్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలో, వాతావరణ మార్పులు కారణంగా సంభవించే సమస్యలు, ప్రస్తుతం రైతులు సాగులో ఎదుర్కొంటున్న సమస్యలపై 20 కేంద్రాల్లో ఎప్పటికప్పుడు పరిశోధనలు చేసి రైతులకు సూచనలు ఇస్తున్నామన్నారు. దేశం మొత్తంలో భారతీయ సమన్వయ పరిశోధన మండలి పరిధిలో ఉష్ణ మండలం, సమ ఉష్ణ మండలంలో పండ్లతోటలపై పరిశోధనలు చేసి గ్రూపు సమావేశాల్లో శాస్త్రవేత్తలు పరిశోధనా ఫలితాలను ఒకరికొకరు షేర్ చేస్తున్నామన్నారు. కొవ్వూరు ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పి.లలితా కామేశ్వరి మాట్లాడుతూ ఐదేళ్లుగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని గిరిజన ప్రాంతాల్లో రైతులకు టిష్యూ కల్చర్ అరటి మొక్కలు అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. ఆదివారం మారేడుమిల్లిలో క్షేత్ర సందర్శనకు వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు వి.శివకుమార్, ఎ.స్నేహలత, కె.రవీంద్రకుమార్ ఉన్నారు.

పగటి పూట రెక్కీ... ఇంట్లో ఎవరూ లేకపోతే చోరీ!

చోరీ కేసుల్లో నిందితుడు.. కాకినాడలో అరెస్ట్

రూ.11.16 లక్షల విలువైన ఆభరణాలు, నగదు స్వాధీనం



పట్టుబడ్డ చోరీ సొత్తును విలేకర్లకు చూపుతున్న డీఎస్పీ రామచంద్రరావ్

కాకినాడ క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడుగా పగటి పూట రెక్కీ నిర్వహిస్తాడు. ఇంట్లో ఎవరూ లేరని తెలిసిన మరుక్షణం ఆ ఇంటిని కొల్లగొట్టి ఉన్నదానికి దోచుకుంటాడు. నిందా రెండు పదుల వయస్సు లేని ఆ యువకుడు గతేడాదిగా పోలీసులకు చిక్కకుండా యథేచ్ఛగా చోరీలు చేస్తూ చివరికి కాకినాడ పోలీసులకు దొరికిపోయాడు. నిందితుడి నుంచి రూ.11,16,840 విలువైన 129 గ్రాముల బంగారు ఆభరణాలు, 560 గ్రాముల వెండి వస్తువులు, రూ.1,50,000 నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ త్రీటౌన్ సెంట్రల్ క్రైం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఇన్‌ఛార్జ్ డీఎస్పీ ఆర్.రామచంద్రరావ్ నిందితుడి వివరాలు వెల్లడించారు. ఇటీవల కాకినాడ టౌన్, రూరల్ పరిసర ప్రాంతాల్లో పగటిపూట దొంగతనాలు అధికం కావడంతో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఎంజెవి భాస్కరరావ్ పర్యవేక్షణలో డీఎస్పీ రామచంద్రరావ్ నేతృత్వంలో సీసీఎస్ సీఐ విశ్వస్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగదుర్గారావుల బృందం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బందికి స్థానిక ఎన్ఆర్ఎంటీ పార్సిల్ ఆఫీస్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ యువకుడు తారసపడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా కాకినాడ పల్లిపేట రాజీవ్‌గృహకల్ప అపార్ట్‌మెంట్స్‌కు చెందిన సంకర తేజగా తెలిపాడు. స్థానిక పీఠర్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతూ జల్సాలకు మరిగాడు. ఈ నేపథ్యంలో సులువుగా డబ్బులు సంపాదించాలని దొంగతనాలను ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ఈ క్రమంలో ఏడాదిగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు నేరాలు, ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు నేరాలు, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక నేరానికి పాల్పడినట్టు అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు. అతడి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ వినయ్‌ప్రతాప్, క్రైం డిటెక్టివ్ ఎస్ఐ కొప్పిశెట్టి గోవిందరావ్, ఏఎస్ఐ ధనరాజ్, హెచ్‌సీలు ప్రసాద్, వర్మ, పీసీలు ఈశ్వరరావ్, నాయుడులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారం వెంకన్న ఆలయాభివృద్ధి

వాడపల్లిలో రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ సందర్శన



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న కమిషనర్

ఆత్రేయపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిందని, మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆలయాభివృద్ధి, భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టిసారించిందని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ఆయన దర్శించుకున్నారు. తొలుత అర్చక బృందం పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకున్న వేదపండితులు ఆశీర్వచనం అందుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వాడపల్లి వెంకన్న క్షేత్రం గత 12 ఏళ్ల నుంచి దినదినాభివృద్ధి చెందుతుందని తద్వారా భక్తుల సంఖ్య అధికంగా ఉన్న దృష్ట్యా వసతి సౌకర్యాలు ఈ క్షేత్రంలో లేకపోవడంతో మాస్టర్ ప్లాన్ ప్రకారం భక్తులకు మెరుగైన సౌకర్యాలు, వసతి, సత్రాలలో దర్శనం అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పార్కింగ్ అన్నదానం, భక్తులకు షెల్టర్, ప్రసాదాలు అందించేందుకు ప్రత్యేక దృష్టి చేపడుతున్నామన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, చిన్నపిల్లలకు ప్రత్యేక దర్శనం కల్పిస్తామన్నారు. కంపార్ట్‌మెంట్లు, క్యూకాంప్లెక్స్ స్లాట్ విధానం అమలు చేసి భక్తులకు సర్లీత సమయంలో దర్శనం అందించేలా చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు క్షేత్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కమిషనర్‌కు వివరించారు.

భక్తుల ఆగ్రహం

శనివారం స్వామివారి పర్వదినం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రముఖుల తాకిడి అధికంగా ఉండటంతో భక్తులు గంటల తరబడి క్యూలో నిలబడి ఉండిపోయారు. రూ.200 దర్శనం టిక్కెట్టు పొందిన భక్తులు సుమారు 5గంటలు క్యూలో నిరీక్షించారు. వీఐపీల సిఫార్సులేఖలతో వచ్చిన భక్తులకు దర్శనాలు సులభంగా అవ్వడంతో క్యూలో వేచి ఉన్న భక్తులు ఆలయ అధికారులపై మండిపడ్డారు. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ భక్తులతో మాట్లాడి వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లలకు త్వరగా దర్శనమయ్యేలా ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాలు, బిస్కెట్లు క్యూలైన్లలో వారికి అందించాలన్నారు. ప్రతీ శనివారం దర్శనాలకు ఆలస్యం కావడంతో లక్షలాది భక్తుల మార్పులు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు.



ఆలయంలో కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న భక్తులు

నూతిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



కుమారపురంలో మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు

పిఠాపురం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడగా మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. గ్రామానికి చెందిన కటారి బాబ్జీ(35), నాగులు వివాహమై ఏనిమిది సంవత్సరాలు కావస్తోంది. బాబ్జీ కూలీ పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారికి పిల్లలు లేరు. ఆదే సమయంలో భార్య తరచూ పుట్టింటికి వెళ్తుండడంతో ఇద్దరి మధ్య వివాదాలు జరిగాయి. ఇదే రీతిలో భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో బాబ్జీ ఈ నెల 26వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2రోజులు గాలించారు. గ్రామంలోని పంటపొలాల్లో ఉన్న నూతిలో దూకి ఆత్మహత్య చేసుకోగా శనివారం పోలీసులు గుర్తించారు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

ఇద్దరికి తీవ్రగాయాలు

పిఠాపురం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెదపూడి చెందిన బళ్ల బుజ్జియ్యలు మేడపాటి రాజకుమార్, వసంతకుమార్ మోటారు కిలీపై పిఠాపురం మండలం బోగాపురం లోని బంధువుల ఇంటికి బయలుదేరారు. జల్లూరు నుంచి ఏకేపాలెం మీదుగా వస్తుండగా పిఠాపురం నుంచి సామర్లకోట వెళ్తున్న కారు ఢీకొంది. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బైక్‌ను కారు ఢీకొన్న దృశ్యం

అస్సాగో బాధితుల అఖిలపక్ష భేటీ భగ్నం

కోరుకొండ పోలీస్‌స్టేషన్‌కు బాధితుల తరలింపు



అస్సాగో బాధితులను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

గోకవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో అస్సాగో ఇథనాల్ కంపెనీ బాధితులు, యాజమాన్యం మధ్య రోజుల ఏభైక రూపంలో వార్ కొనసాగుతూనే ఉంది. మరోపక్క పోలీసులు నుంచి కూడా బాధితులు ప్రతిబంధన ఎదుర్కోవడం తప్పడం లేదు. అస్సాగో పరిశ్రమ నుంచి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉన్నతాధికారులకు వివరించేందుకు పలు పార్టీలతో అఖిలపక్ష సమావేశానికి బాధితులు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం గ్రామంలోని రామాలయం సెంటర్ వద్ద సమావేశం ఏర్పాటుకు సన్నాహాలు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సమావేశ స్థలం వద్దకు చేరుకుని సమావేశ నిర్వహణకు అనుమతి లేదంటూ బాధితులతో వాదించారు. తదుపరి బాధితులను కోరుకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో గ్రామంలోకి వచ్చిన సామాజిక ఉద్యమనేత పాటంశెట్టి సూర్యచంద్రను గ్రామం నుంచి వెనక్కి పంపివేసి బాధితులను విడిచి పెడతామంటూ పోలీసులు హుకుం జారీ చేశారు. నమూనా అందుకున్న సూర్యచంద్ర కోరుకొండ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని బాధితుల ఇబ్బందులను పోలీసులకు వివరించారు. సమస్య పరిష్కారానికి మార్గం చూపాలని సీఐ సత్య కిషోర్, ఎస్ఐ పవన్‌కుమార్‌ను కోరారు. గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన పరిశ్రమను వదిలి బాధితులపై కేసులు నమోదు చేయడం దురదృష్టకరమన్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించినవారిలో వందాసి చినబాబు, బూలా అబ్బులు తదితరులున్నారు. గ్రామంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు భారీ ఎత్తున మోహరించారు.

సత్యదేవుని సన్నిధిలో ఐఏఎస్‌ల పూజలు



ఐఏఎస్ అధికారులకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం బీహార్ రాష్ట్రానికి చెందిన ఐఏఎస్ అధికారులు డాక్టర్ సిద్ధార్థ, ఎస్.విజయలక్ష్మిలు స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు.

రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన పాలూరి వీరవెంకట సత్యనారాయణ రూ.లక్ష విరాళంగా సమర్పించారు. దాత ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించారు.



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

మంత్రి నాదెండ్లకు ఘన స్వాగతం



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్, ప్రజాప్రతినిధులు

కోరుకొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సివిల్ సప్లయి శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు శనివారం తూర్పుగోదావరి జిల్లా మధురపూడి విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం లభించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రమాదాల్లో బాధితులైన జనసేన క్రియాశీలక సభ్యులకు బీమా చెక్కులు అందజేసేందుకు వచ్చిన మంత్రి నాదెండ్లకు మధురపూడి విమానాశ్రయం వద్ద పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్వాగతం పలికారు. నాదెండ్లకు ఎమ్మెల్యే బత్తుల గజమాల వేసి సత్కరించారు. దాన్యం బస్తాలతో నిండిన రెండెడ్ల బండి నమూనాను అందజేశారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే బత్తుల రూపొందించిన 2025 సంవత్సర క్యాలెండర్‌ను మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, తోట పవన్‌కుమార్, జనసైనికులు, వీర మహిళలు ఉన్నారు.

విజయదుర్గా పీఠాన్ని సందర్శించిన టీటీడీ ప్రధాన అర్చకుడు



విజయదుర్గాకు పూజలు చేస్తున్న టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు

రాయవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు శనివారం సందర్శించారు. విజయదుర్గా అమ్మవారికి అర్చనలు, హారతులు నిర్వహించి పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. తిరుమల నుంచి తీసుకువచ్చిన శ్రీవారి ప్రసాదాలు, లడ్డూలు గాడ్‌కు అందజేసి గాడ్‌ను శ్రీవారి శేషవస్త్రంతో వేణుగోపాల దీక్షితులు సత్కరించారు. అనంతరం పీఠంలో జరుగుతున్న పవిత్రోత్సవాలను ఆయన కొద్దిసేపు తిలకించారు. విజయదుర్గా పీఠంలో తిరుపతి వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయదుర్గాదేవి, విజయ వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు శనివారంతో ముగిశాయి. వైఖానస పండితులు సాయి బృందం ఆధ్వర్యంలో విజయదుర్గా అమ్మవారికి అర్చనలు, స్వామివారికి అమ్మవార్లకు అర్చనలు, హోమం పూర్ణాహుతి నిర్వహించారు. పీఠాధిపతి గాడ్ పవిత్రోత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు స్వామి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

మందేశ్వరాలయానికి క్యూ కట్టిన భక్తులు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వేలాది మంది భక్తులు

స్వామివారి ఆదాయం రూ.33.85లక్షలు

కొత్తపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శనిత్రయోదశి సందర్భంగా శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపల్లి శనీశ్వర (మందేశ్వర) స్వామివారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే సర్వదర్శనం, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి శేషవస్త్రం, చిత్రపటం అందించారు. వేద ఆశీర్వచనం అందించారు. స్వామివారికి ఏడేళ్ల గురు ప్రాప్తి శనివారం తైలాభిషేకం నిమిత్తం రూ.1.45లక్షలు చెల్లించారు. శనివారం వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.33,85,938 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

మామిడికుదురు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాల మధ్య సుప్రభాత సేవ చేసి స్వామివారికి తొలిహారతి ఇచ్చారు. దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,12,910 ఆదాయం వచ్చింది. స్వామివారిని 3518మంది భక్తులు దర్శించుకుని, 2429 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు పేర్కొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాదేశాల మేరకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 14 పురపాలక సంఘాల పరిధిలో వివిధ రకాలైన నైపుణ్య రంగాల్లైన ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్స్, ఏసీ, గీజర్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ రిపేర్, బ్యూటీషియన్, సెలూన్లకు ఎన్ఎస్‌డీసీ ద్వారా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని మెప్మా అధికారులు తెలిపారు. దీనిలో అర్హత పొందినవారికి హోమ్ ట్రయాంగిల్ సైట్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ చేసి వారికి జీవనోపాధి కల్పించడంలో భాగంగా ఈనెల 31లోగా స్థానిక పురపాలక సంఘంలో మెప్మా విభాగంలో వివరాలు నమోదు చేయించుకోవాలని వారు కోరారు.

నేడు ఉమ్మడి జిల్లా బాలురు, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలుర, బాలికల కబడ్డీ జట్లు ఎంపికలు ఈనెల 29వ తేదీ ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఏవీడీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 3, 4, 5 తేదీల్లో జరుగబోయే 50వ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్లను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు బాలురు 70 కిలోల బరువు, బాలికలు 65 కిలోల బరువు ఉండాలని, ఆధార్ కార్డు, జిరాక్సు కాపీలు తీసుకురావాలని సూచించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు, పీడీలు తమ విద్యార్థులను ఆర్ట్స్ కళాశాల గ్రౌండుకు తీసుకురావాల్సిందిగా కోరారు.



స్వామివారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

శృంగారవల్లభస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

పెద్దాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామిని భక్తులు శనివారం దర్శించుకున్నారు. దీంతో ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.88,440 అన్నదాన విరాళాలు రూ.60,464 ఆలయ, కేశఖండన ద్వారా రూ.3,880, తులాభారం, కానుకలు ద్వారా రూ.100, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.17,235 వెరసి రూ.1,70,119 ఆదాయం సమకూరినట్టు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. 9వేల మంది భక్తులు స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు పాల్గొన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

రాజోలు, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): రాజోలు నున్నవారి బాడవ ఇసుకర్యాంపు సమీపంలో శనివారం తాటిపాకకు చెందిన బి.ప్రదీప్‌ను 540 గ్రాముల గంజాయితో అరెస్టు చేశామని ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపారు. గంజాయిని సీజ్ చేశామన్నారు. రాజోలు జేఎఫ్‌సీఎం కోర్టు అతడికి 14రోజులు రిమాండ్ విధించిందన్నారు.

ఎంపీడీవోపై దాడికి నిరసన

అంబాజీపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడిని నిరసిస్తూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జీవీ సరోవర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. కార్యాలయం ఏవో పీఎల్ నరసింహం, జూనియర్‌అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, టైపిస్టు బలదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్‌పాలెం ర్యాంపుపై టాస్క్‌ఫోర్స్ దాడి


ఇసుక ర్యాంపులో వివరాలు నమోదు చేసుకుంటున్న మైన్స్ అధికారులు

పి.గన్నవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలంలో నిబంధనలకు విరుద్ధంగా గోదావరి తీరం వెంబడి సీఆర్‌జెడ్ పరిధిలో ఇసుక ర్యాంపులు నిర్వహిస్తున్నారని, ర్యాంపులకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన ఎంపీటీసీ ఆదిమూలం సూర్యనారాయణమూర్తి కలెక్టరేట్, అమరావతిలోని పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక)లో ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం సాండ్‌టాస్క్ ఫోర్స్ అధికారులు పి.గన్నవరం శివారు డీఎస్‌పాలెంలో ఇసుక ర్యాంపుపై దాడులు నిర్వహించారు. ర్యాంపులో ఒక ట్రాక్టర్‌ను, పోలీస్‌స్టేషన్ సమీపంలో రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు మైన్స్ అధికారులు తెలిపారు. మైన్స్ అధికారులు ఇసుక ర్యాంపులోకి చేరుకోవడంతో అక్కడ పదుల సంఖ్యలో ఉన్న ట్రాక్టర్లు ఇసుకను అక్కడికక్కడే దిగుమతి చేసుకుని ర్యాంపు నుంచి బయటపడే ప్రయత్నం చేశారు. ఖాళీ ట్రాక్టర్లపై కూడా కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ర్యాంపు నడుస్తోందని, ఇసుక కోసం వచ్చామని ఖాళీ ట్రాక్టర్లపై ఏవిధంగా కేసులు నమోదు చేస్తారని ఆందోళనచేశారు. దీంతో అధికారులకు, ట్రాక్టర్ డ్రైవర్ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. డ్రైవర్లు ఇచ్చిన నివేదికను లిఖిత పూర్వకంగా తీసుకుని ఖాళీట్రాక్టర్లను వదిలిపెట్టారు. దాడుల్లో మైన్స్ ఆర్ఐ సుజాత, హెడ్‌వర్క్స్ జేఈ ఏ.దుర్గా నాయుడు, ఏఎస్ఐ ఎన్.పట్టాభిరామయ్య, ఆర్ఐ వి.డాంగే, వీఆర్వో కోరుకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో ఆధునిక టెక్నాలజీ వినియోగించాలి

నేర సమీక్షలో ఎస్పీ కృష్ణారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో కాలానుగుణంగా మారుతున్న అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకుని నేరస్తుల ఆట కట్టించాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. నేరాల అదుపు కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన సీసీ టీవీ కెమెరాలకు అదనంగా ముఖ్యమైన చోట్ల పోలీసుల చొరవతో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసుస్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఆరా తీశారు. నేర సమీక్షలో భాగంగా త్వరలో జరిగే సంక్రాంతి వేడుకల్లో భాగంగా పోలీసులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. జిల్లాలో ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా నేర పరిశోధనలో టెక్నాలజీని ఉపయోగించుకోవడం ద్వారా కేసులను ఎలా పరిష్కరించవచ్చో సోదాహరణంగా వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఏవీఆర్ పీబీ ప్రసాద్, అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌తో పాటు సీఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


కిశోర బాలికలకు అవగాహన కల్పించాలి

మలికిపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల శారీరక మార్పులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి అన్నారు. శనివారం మలికిపురం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయిలో కిశోర వికాసంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో రమాదేవి మాట్లాడారు.. సమావేశంలో ఎస్ఐ పి.సురేష్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఎంఈవో విజయశ్రీ, వైద్యాధికారులు చంటి, నరసింహారావు, ఐసీడీఎస్ అధికారిణి శిరీష, సూపర్‌వైజర్లు ప్రసన్నరాణి, చంద్రకళ, హైమావతి, సరోజిని, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా పోలీసులు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహ్లాదబాబా ఆశ్రమంలో వేడుకగా సద్గురు వ్రతాలు

అల్లవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం తోటల పందరి ప్రహ్లాద బాబా ఆశ్రమంలో 105వ జయంతి వేడుకల్లో భాగంగా శనివారం సామూహిక సద్గురు సత్యవ్రతాలు వేడుకగా జరిగాయి. పోచినపెద్ది వెంకటేశ్వర్లు, వెంకటేష్, మానేపల్లి భాస్కర శర్మ సద్గురు వ్రతాలు చేయించారు. అఖండ సాయిసద్గురు సంకీర్తనలతో ప్రహ్లాద బాబా ఆశ్రమం మారుమోగింది. ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ ఎస్పీ డాక్టర్ కొండా నరసింహారావు దంపతులు శంఖానాదంతో భక్తులను మంత్రముగ్ధులను చేశారు. డాక్టర్ కొండా దంపతులు ప్రహ్లాద బాబా సమాధిని, సత్తెమ్మతల్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. నిర్వాహకులు రాంజీ, డాక్టర్ కె.ప్రభాకర్, డాక్టర్ కొప్పినీడి రమణకుమార్, ఎన్.రంగరాజు, దాట్ల కృష్ణరాజుతో పాటు ఉభయరాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు చిత్రనివాళి



అమలాపురం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతదేశ అభివృద్ధికి బాటలు వేసిన ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ మృతిచెందడంతో పాలగుమ్మి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహచంద్రకుమార్ వాటర్ కలర్స్ ఉపయోగించి ఆయన చిత్రాన్ని గీసి చిత్రనివాళులర్పించారు.

'విద్యుత్ చార్జీల భారం పాపం జగన్‌దే'


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంటౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలను ఎన్నిసార్లు పెంచారో మరిచిపోయారా అని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం చేసిన పాపాల ఫలితంగానే విద్యుత్ చార్జీలను పెంచాల్సి వచ్చిందన్న విషయాన్ని ప్రజలు గుర్తించినా వైసీపీ నాయకులు గుర్తించకపోవడం శోచనీయమన్నారు. చంద్రబాబు పాలనలో మిగులు విద్యుత్ అందించిన రాష్ట్రానికి వేల కోట్ల రూపాయలు భారంగా మిగిల్చారని విమర్శించారు. అమలాపురంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆనందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను సీఎం చంద్రబాబు తిరిగి గాడిన పెట్టేందుకు శత విధాలా ప్రయత్నిస్తుంటే జగన్‌రెడ్డి విషం కక్కుతున్నారని ఎద్దేవా చేశారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ పాల్గొన్నారు.

చార్జీలు పెంచిన ఘనత జగన్‌దే

మామిడికుదురు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత జగన్‌దేనని జడ్పీ మాజీ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు ఎద్దేవా చేశారు. పాశర్లపూడిలో శనివారం జరిగిన టీడీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని వైసీపీ ధర్నాలు, ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలోనే ప్రజలపై విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచారని ఆరోపించారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, సూదా బాబ్జి, గంధం భాస్కర్, చుట్టుగుళ్ల కిశోర్, తోట పెద్దబ్బులు పాల్గొన్నారు.

ఉద్యోగులు జవాబుదారితో పనిచేయాలి

ఐ.పోలవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు జవాబుదారీతనంతో పనిచెయ్యాలని ఎంపీపీ మోర్త మిరియంరాణిజ్యోతి అన్నారు. శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు, ప్రజలకు తెలియచేయాలన్నారు. గతంలో కోరం లేక రెండు సార్లు మండల సమావేశాన్ని వాయిదా వేశారు. మూడో సారి శనివారం సమావేశం జరిగినప్పటికీ ఆశించిన స్థాయిలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకాలేదు. ఎంపీడీవో శర్మ మాట్లాడుతూ సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఎంపీటీసీలకు విలువ ఇవ్వకుండా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందని మురమళ్ళ ఎంపీటీసీ మట్టపర్తి శివ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖల వారీగా తాము చేపట్టబోయే పనులను అధికారులు వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పిన్నమరాజు బాబ్జీరాజు, పాలనాధికారి ఎం.లక్ష్మీరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ధనలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న మల్లాడి



యానాం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక గోపాల్‌నగర్‌లోని రామరాజు గార్డెన్స్‌లో ఉన్న ధనలక్ష్మీ అమ్మవారిని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. తొలుత గార్డెన్స్ నిర్వాహకులు ఎస్ఆర్ఐ చింతా గణేష్ నేతృత్వంలో ఆ ప్రాంతాన్ని మల్లాడి సందర్శించారు. రామరాజు గార్డెన్స్‌లో మంచినీటి పైప్‌లైన్ సదుపాయం కల్పించిన నేపథ్యంలో చింతా గణేష్, స్థానికులు మల్లాడిని సత్కరించారు. స్థానికులతో కలిసి డ్రైనేజీ తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు.

సిద్ధివినాయక ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. భక్తులతో క్యూలైన్లు, ఆలయ మండపాలు కిక్కిరిశాయి. లఘున్యాస అభిషేకాలు, ఉండ్రాళ్లపూజ, ప్రత్యేక దర్శనాలు 430, లక్ష్మీగణపతి హోమాలు 16, అన్నప్రాసన1, తులాభారం1, ఆశీర్వచనం 5, నాలుగు చక్రాల వాహనాల పూజ, ద్విచక్ర వాహన పూజ 5, కొబ్బరికాయల మొక్కుబడి 27, జలాభిషేకం 11, పులిహోర ప్రసాదం 1215, లడ్డూ ప్రసాదం 1376, అన్నప్రసాదానికి 1930 మంది, అన్నదాన విరాళాలు రూ.1,41,060, విరాళం రూ.6316, మొత్తం ఆదాయం రూ.2,43,854 వచ్చినట్టు సహాయ కమిషనర్ సత్యనారాయణరాజు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఐ.పోలవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): దివంగత టీడీపీ నాయకుడు నడింపల్లి శ్రీనివాసరాజు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మురమళ్ళ బైర్రాజు ఫౌండేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రారంభించారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి కంటి డాక్టర్ శ్రీవల్లి 160మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. నలభై మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. తొలుత ఎమ్మెల్యే కంటి పరీక్షలుచేయించుకున్నారు. అంతకు ముందు శ్రీనివాసరాజు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, జంపన బాబు, చెల్లి అశోక్, నడింపల్లి రామరాజు, ఏలూరి మూర్తి, గుంజా సుధాకర్, కిరణ్ ఆసుపత్రి సిబ్బంది సత్యనారాయణ, బోసు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌ను సత్కరించిన ఎంపీపీ కేతా

రాజోలు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పొన్నమండలో శనివారం గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్‌ను స్వగృహంలో ఎంపీపీ కేతా శ్రీను-వెంకటలక్ష్మి దంపతులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీపీ కేతా మాట్లాడుతూ సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ పరిధిలో ఉన్న కాల్వలను మెరుగుపరచాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలలో చిక్కుకున్న పామును రక్షించిన వర్మ

కాట్రేనికోన, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెయ్యేరు అగ్రహారం మంతెన సుబ్బరాజు చెరువుల వద్ద 5రోజులుగా వలలో చిక్కుకున్న త్రాచు పాము కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. సమాచారం తెలుసుకున్న స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మ శనివారం వలలోని పాముకు నీరు తాగించారు. పామును వల నుంచి బయటకు తీసి సురక్షిత ప్రాంతంలో వదిలేశారు.

బీవీసీలో ముగిసిన సాంకేతిక శిక్షణ

అల్లవరం, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి):ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజులుగా ఏపీ ఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న సాంకేతిక శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. కంప్యూటర్ సైన్స్, సివిల్, ఏఐడీఎస్, విభాగాలకు చెందిన 300మంది విద్యార్థులు , ఇతర విభాగాల నుంచి 600మంది శిక్షణ పొందారు. గేమ్ డిజైన్, యూజింగ్ యూనిటీ, త్రీడీ స్టార్ట్‌ప్రో అంశాలపై శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మహేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ప్రవీణ్, ఏవో ఏవైఆర్వీ ప్రసాద్, ఐఐఐసీ అధికారి డాక్టర్ కె.రాజశేఖర్, బీఎస్ఎన్‌మూర్తి, మీరాషరీఫ్, ఎస్.శివకుమార్ పాల్గొన్నారు. శిక్షణ పొందిన వారిని కళాశాల సెక్రటరీ బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణసతీష్ అభినందించారు.

అర్బన్ మార్కెట్ ప్రారంభం

ముమ్మిడివరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): డిమాండ్‌కు అనుగుణంగా డ్వాక్రా మహిళలు ఉత్పత్తులను తయారుచేయడం ద్వారా మార్కెటింగ్ పొంది లాభాలు ఆర్జించవచ్చునని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అర్బన్ మార్కెట్‌ను శనివారం చైర్మన్ ప్రారంభించారు. అర్బన్‌మార్కెట్‌లో ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఏర్పాటుచేసిన స్టాల్స్‌లో చీరలు, పంజాబీడ్రెస్సులు, పచ్చళ్లు, తినుబండారాలు, జ్యూట్ బ్యాగులు, ఫ్లవర్‌వాజ్‌లు, కొవ్వొత్తులు, పేపర్‌ప్లేట్లు, హల్దీ జ్యూవెలరీ, ఆర్గానిక్ ప్రొడక్టులు ఏర్పాటుచేశారు. తాడి నరసింహారావు, మేనేజర్ పీవీ నూకరాజు, టీపీవో బి.రాజేష్‌బాబు, ఏఈ పీవీ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ జె.సత్యనారాయణరాజు, సీఎంఎం భాస్కర్, సీవో రాజేశ్వరి, ఆర్పీలు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్ తనిఖీ

ముమ్మిడివరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం బళ్లగేటు సెంటర్‌లో ఉన్న అన్నక్యాంటీన్‌ను నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నక్యాంటీన్‌లో అందిస్తున్న ఆహార నాణ్యతను, టోకెన్ల జారీ విధానాన్ని పరిశీలించారు. 10వ వార్డులో జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను, నగరపంచాయతీ సుందరీకరణలో భాగంగా పోలమ్మ చెరువుగట్టున జరుగుతున్న పనులు పరిశీలించారు. మేనేజర్ పీవీ నూకరాజు, ఏఈ పీవీ సుధాకర్, టీపీవో బి.రాజేష్‌బాబు, హెల్త్ అసిస్టెంట్ జె.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

హక్కుల నేత మాధవరావుకు నివాళి

అమలాపురంటౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): హక్కుల ఉద్యమ నేత, సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు అకాల మృతి హక్కుల ఉద్యమానికి తీరని లోటని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్, ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ ఇక్బాల్, నామాడి శ్రీధర్ పేర్కొన్నారు. మానవ హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన మాధవరావు విద్యార్థి దశ నుంచి విప్లవ రాజకీయాల్లో పనిచేశారన్నారు. నాలుగు దశాబ్దాలుగా హక్కుల ఉద్యమాలను నడిపించారన్నారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ బిల్లుల వసూళ్లు

అమలాపురం రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని విద్యుత్, రెవెన్యూ కార్యాలయాల్లో ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూళ్ల కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సిద్దెల రాజబాబు తెలిపారు. విద్యుత్, రెవెన్యూ కార్యాలయాలతో పాటు ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ ఆఫీసు కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో బిల్లులు చెల్లించవచ్చన్నారు.

ఉత్సవ కమిటీ సమావేశం

అమలాపురం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ఉత్సవ కమిటీ సమావేశం ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లు, నూతన సంవత్సర క్యాలెండర్, పోస్టర్ల ముద్రణ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు జంగా అబ్బాయివెంకన్న, మోకా వెంకటసుబ్బారావు, దున్నాల వేణు, గోకరకొండ లక్ష్మణరావు, కుంచే వెంకన్నబాబు, గన్నవరపు సూర్యభాస్కరరావు, ఎ.దొరబాబు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండపేట

వైసీపీ ఆందోళన సిగ్గుచేటు

మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల ధ్వజం


ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో విద్యుత్ చార్జీలను తొమ్మిది సార్లు పెంచిన ఘనత జగన్‌కే దక్కుతుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందంటూ శుక్రవారం వైసీపీ చేసిన ఆందోళన సిగ్గుచేటని ఆయన ఎద్దేవా చేశారు. టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచలేదన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జగన్ పాలనను ప్రజలు తిరస్కరించి 11 సీట్లకు పరిమితం చేసినా సిగ్గు లేకుండా రోడ్డెక్కి ధర్నాలు జరిపినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గత ప్రభుత్వంలో రహదారులు కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో రోడ్డు మరమ్మతులు జరుగుతున్నాయన్నారు.

వైసీపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులపై ఎమ్మెల్యే వేగుళ్ల ఘాటైన వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గ ప్రజలు వైసీపీ గూండా పాలనను ఓడించారన్నారు. నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్, మద్యం దోపిడీకి కేరాఫ్ అడ్రస్ తోట త్రిమూర్తులని ఆయన ఆరోపించారు. పార్టీలు మారటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల అనంతరం టీడీపీ, జనసేనలో చేరేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయని ఇప్పుడు బీజేపీలో చేరేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల విమర్శించారు.

జగన్ నిర్వాకమే నేడు విద్యుత్ చార్జీల భారం

ఎమ్మెల్యే బండారు


మాట్లాడుతున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ అసమర్థపాలన వల్లే నేడు విద్యుత్ ఛార్జీల భారమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం వాడపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ ద్వారా యూనిట్ విద్యుత్ ధర రూ.4.86లు సరఫరా చేసేలా ఒప్పందం చేసుకుంటే జగన్ ప్రభుత్వం వచ్చి అసమర్థ, అవినీతి పాలనతో ఆ ఒప్పందాన్ని నిర్వీర్యం చేసి కొత్తదారులు తొక్కారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని నిందించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యుత్ చార్జీల భారం జగన్ పాపమేనని ప్రజలకు తెలుసనన్నారు. సమావేశంలో కంఠంశెట్టి శ్రీనివాస్, ముత్యాల బాబ్జి, పల్లి ఏసు, పెచ్చెట్టి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

శునకాలతో నిత్యం భయం...భయం

రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో వీధికుక్కల సమస్యపై కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వీధి కుక్కలకు వ్యాక్సిన్, సంతాన నిరోధానికి స్టెరిలైజేషన్ చేసేందుకు 50 కుక్కలకు రూ.7500 చెల్లించేందుకు ఎజెండాలో అంశంపై కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, పెంటపాటి దేవీ మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కలు పెద్ద సంఖ్యలో ఉన్నాయన్నారు. వీధికుక్కల దాడితో పిల్లలు, పెద్దలు గాయపడుతున్నారని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో వ్యాక్సిన్ లేకపోవడంతో కాకినాడలో వ్యాక్సిన్ వేయించుకుంటున్నారని అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో స్వయంశక్తి సంఘాల మహిళల నుంచి వడ్డీల రూపంలో కొంతమంది ఆర్పీలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని కౌన్సిలర్ అంకం శ్రీనివాస్ ఆరోపించారు. సభలో ఎ.శ్రీనివాస్, పి.దేవిశ్రీనివాస్ పలు అంశాలపై మాట్లాడారు. సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు పట్టణం,ముచ్చుమిల్లి రోడ్డులో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవికి వినతిపత్రం ఇచ్చారు. సమావేశంలో ఎజెండాలో పొందుపరిచిన అభివృద్ధి పనులకు అనుమతుల అంశాలను ఆమోదించారు. కమీషనర్ అయ్యప్ప నాయుడు, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి ఆర్థికసాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం శలపాకలో హత్యకు గురైన బత్తుల రమేష్ కుటుంబానికి మంత్రి సుభాష్ రూ.50 వేల ఆర్థికసాయం అందించారు. గత దీపావళి రోజున శలపాకలో ముగ్గురు వ్యక్తులు హత్యకు గురైన సంగతి తెలిసిందే. వీరిలో బత్తుల రమేష్ భార్య శ్రీవల్లి భర్తను కోల్పోయి 8నెలల బాలుడితో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. దీంతో మంత్రి రూ.50 వేల చెక్కును శలపాక సర్పంచ్ పోతుల గనిరాజు, మాజీ సర్పంచ్ పోతురాజు భీమారావుల ద్వారా ఆమెకు అందించారు.

లంక గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కపిలేశ్వరపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలంలోని లంకగ్రామాలైన కేదార్లంక, అద్దంకివారిలంక గ్రామాల్లో శనివారం గ్రామరెవెన్యూ సదస్సులు జరిగాయి. ఆయా గ్రామాల సర్పంచ్‌లు వీధివెంకటరెడ్డి, నాతి గవరయ్యల అధ్యక్షతన జరిగిన రెవెన్యూ గ్రామసభల్లో మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో కామేశ్వరరావు, తహశీల్దార్ పి.చిన్నారావు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.246 కోట్లు

• వైసీపీ ధర్నాలు హాస్యాస్పదం • ప్రజలపై విద్యుత్ భారం మోపింది గత ప్రభుత్వమే • మంత్రి సుభాష్ ధ్వజం


మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గంలో రూ.246 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్టు మంత్రి సుభాష్ తెలిపారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరునెలల పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల వివరాలు తెలిపారు. రూ7.86 కోట్లతో ఆర్అండ్‌బీ, రూ.7.16 కోట్లతో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా రహదారుల నిర్మాణం, మరమ్మతులు చేపట్టినట్టు తెలిపారు. గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ ద్వారా 9.72 కోట్లతో తాగునీటి పనులు చేస్తున్నామన్నారు. రూ.4.09 కోట్లతో 195 పశువుల షెడ్ల నిర్మాణానికి మంజూరు చేశామన్నారు. సామాజిక భవనాల నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.50 లక్షలు కేటాయించామన్నారు.

వైసీపీ ధర్నాలు సిగ్గుచేటు: గత ప్రభుత్వ హయాంలో 32 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ఇప్పుడు ధర్నాలు చేయడం సిగ్గు చేటని మంత్రి ధ్వజమెత్తారు. అభి వృద్ధిపై చిత్తశుద్ధి లేకపోగా కనీసం సమీక్షలు కూడా చేయలేదన్నారు. వైసీపీకి 11 సీట్లు ఇచ్చినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. నవరత్నాల పేరుతో అప్పులు చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ఆరు నెలల్లో రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు.

వైసీపీ అవినీతిపై చర్చకు సిద్ధం: గత ప్రభుత్వహయాంలో నవరత్నాల పేరుతో, జగనన్న కాలనీ లే అవుట్ల ల్యాండ్ ఫిల్లింగ్, ఈక్రాఫ్ ఇన్సూరెన్సు, ద్రాక్షారామ భీమేశ్వరాలయం, ఏరియా ఆసుపత్రిలో అవినీతి జరిగిందని దీనిపై బహిరంగ చర్చకు రావాలని మంత్రి సవాల్ చేశారు. వెంకటాయపాలెంలో నిర్మిస్తున్న సామాజిక భవనం పూర్తి కాకుండా అద్దెకు ఇస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఏఈ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ విచారణ అధికారిని నియమించారని తెలిపారు. తనపై సర్పంచ్, వైసీపీ నాయకులు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఎవరిపై కక్ష సాధించాల్సిన పని లేదన్నారు.

4న మండల పరిషత్ సమావేశం

కె.గంగవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జనవరి 4న ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం జరిగే సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

దోపిడీ కప్పిపుచ్చుకునేందుకే తప్పుడు ఆరోపణలు

రావులపాలెం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మట్టి దోపిడీని కప్పిపుచ్చుకోవడానికి పార్క్ ధ్వంసమంటూ మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ శ్రేణులు అన్నారు. రావుల పాలెం క్యాంపు కార్యాలయం వద్ద తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, మండల శాఖ అధ్యక్షుడు జి.పట్టాభి రామారావు మాట్లాడుతూ కొమరాజులంక పార్క్ పేరిట జరిగిన మట్టిదోపిడి అందరికీ తెలిసిందేనన్నారు. ఏడు నెలల అనంతరం పార్క్‌లో ఒకటి రెండు శిలఫలకాలు చూపించి కూటమి నాయకులు ధ్వంసం చేశారంటూ ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఎల్లవేళలా కట్టుబడి ఉన్నారని అన్నారు. సమావేశంలో కాసా సాగర్, వడాల బుల్లికొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో నటుడు పృథ్వీరాజ్ పూజలు


స్వామివారిని దర్శించుకున్న నటుడు పృథ్వీరాజ్

ద్రాక్షారామ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకుని సినీనటుడు పృథ్వీరాజ్ సందర్శించారు. భీమేశ్వర స్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఆయన వెంట భీమేశ్వర దంత వైద్యశాల వైద్యుడు డాక్టర్ క్రాంతికుమార్ ఉన్నారు.

భీమేశ్వరుని సేవలో బీహార్ అదనపు ముఖ్య కార్యదర్శి

ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని శనివారం బీహార్ రాష్ట్ర ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఎస్.సిదార్థ, ఎస్.విజయలక్ష్మిలు సందర్శించారు. భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేశారు. వీరికి ఆర్డీవో అఖిల స్వాగతం పలికారు.

అగస్తేశ్వరస్వామి ఆలయంలో సినీనటి అపూర్వ పూజలు

మండపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అర్తమూరు గ్రామంలోనున్న అగస్తేశ్వరస్వామికి శనిత్రయోదశిని పురస్కరించుకుని సినీనటి అపూర్వ శనివారం స్వామివారికి, నందీశ్వరుడికి జరిగిన పూజల్లో పాల్గొన్నారు. ఆమెకు ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమెతోపాటు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సతీమణి మహాలక్ష్మి, సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి, మండపేట రూరల్ ఎస్ఐ పి.బుజ్జిబాబు తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

రైతుల సాగునీటి సమస్యకు పరిష్కారం

ఆలమూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం గుమ్మిలేరులో గ్రామ పంచాయతీ చెత్త వేయడం వల్ల సాగునీటికి ఇబ్బందులు వస్తున్నాయని రైతులు ఫిర్యాదులు చేయడంతో ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు శనివారం పరిశీలించారు. ఇక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకుని మరో ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తామని రైతులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అమూజూరి శ్రీనివాస్‌తోపాటు, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా అరికట్టాలి

కపిలేశ్వరపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీవో ఎ.గజలక్ష్మి, ఎంపీడీవో కె.రత్నకుమారి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కిషోరీ వికాసం శిక్షణలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీవో గజలక్ష్మి, ఎంపీడీవో రత్నకుమారి, శ్రమ ఎన్జీవో కోఆర్డినేటర్ నాగేశ్వరి, వైద్యాధికారులు డాక్టర్ దుర్గాదేవి, డాక్టర్ రాజ్‌కుమార్, ఎంపీహెచ్ఈవో జె. మల్లిఖార్జునుడు, వెలుగు ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, డీఆర్జీ, మెంబర్లు వీటిపై శిక్షణ ఇచ్చారు.

సోమేశ్వరంలో క్రిస్మస్ వేడుకలు

రాయవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం గ్రామంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. గ్రామానికి చెందిన శాకా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వేగుళ్ల లీలా కృష్ణ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

ద్రాక్షారామ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలు పరిష్కరిస్తామని ఆర్డీవో దేవరకొండ అఖిల అన్నారు. శనివారం రామచంద్రపురం మండలం హసన్‌బాదలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సావిత్రి, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సత్వర న్యాయానికే రెవెన్యూ సదస్సులు

కొత్తపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భూ హక్కుదారులకు సత్వరం న్యాయం చేయడానికే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని కొత్తపేట పంచాయతీ సర్పంచ్ బూసి జయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాసరావు, ధర్నాల రామకృష్ణ, మిద్దే ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

ఆత్రేయపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహశీల్దారు రాజేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కట్టుంగలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. నిర్ణీత గడువులోపు వీటిని పరిష్కరిస్తామని తహశీల్దారు తెలిపారు.

ప్రపంచ తెలుగు రచయితల సభలో ఆలమూరు యువకవి

ఆలమూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల సభలో ఆలమూరు యువకవి గోడవర్తి శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభకు వచ్చిన ఆహ్వానం మేరకు ఆయన పాల్గొన్నారు. తెలుగుభాష అభిమానాన్ని చాటుకున్న తమిళనాడు ఎంపీ కృష్ణగిరి, ప్రముఖ రచయితలు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితర రచయితలకు తాను రచించిన ఆలమూరోళ్ల కథలు పుస్తకాలను అందించారు. సభలో శ్రీనివాస్ ప్రసంగంతోపాటు కవితను వినిపించగా, ఆయన్ను పలువురు అభినందించారు.

దేవాలయాల్లో చోరీ

కె.గంగవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పామర్రు గ్రామంలోని రెండు దేవాలయాల్లో హుండీలు చోరీకి గురయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. పామర్రు బస్‌స్టాండ్ సెంటర్‌లోని వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి ఆలయం, శ్రీరామ్‌నగర్ కాలనీలోని అంజనేయస్వామి ఆలయాల్లోని హుండీలను పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి ఆలయాల తలుపు లతాళాలు పగులకొట్టారు. అనంతరం లోపల ఉన్న హుండీ తాళాలు పగులకొట్టి నగదు దోచుకుపోయారు. తెల్లవారు జామున భక్తులు చూసేసరికి తాళాలు పగులకొట్టి ఉండటంతో చోరీ జరిగినట్టు గుర్తించారు. దీనిపై పామర్రు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్టు వర్తక సంఘం నాయకులు తెలిపారు.